# ఫ్లైయాష్ తరలింపులో ₹100 కోట్ల స్కాం

- రోజుకు ₹50 లక్షల దాకా ప్రభుత్వ ఖజానాకు గండి
- అందులో పొన్నం ప్రభాకర్ హస్తం
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సంచలన ఆరోపణలు
- హుజూరాబాద్‌లో ఫ్లైయాష్ తరలిస్తున్న లారీల అడ్డగింత



హుజూరాబాద్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూన్ 8: ఎన్టీపీసీ ఫ్లైయాష్ తరలింపులో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని, రోజుకు ₹50 లక్షల దాకా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఫ్లైయాష్ తరలింపులో ఇప్పటి వరకు ₹100 కోట్ల స్కాం జరిగిందని, అందులో పొన్నం ప్రభాకర్ హస్తం ఉందని తీవ్రంగా ఆరోపించారు. శనివారం హుజూరాబాద్ శివారులోని కరీంనగర్ రోడ్డు కాకతీయ కాలువ వద్ద ఫ్లైయాష్ తరలిస్తున్న లారీలను ఆయన అడ్డుకున్నారు. బూడిద తరలింపునకు సంబంధించి వే బిల్లులు ఉన్నాయా..? అని డ్రైవర్‌ను అడగగా కేవలం ఖమ్మంలోని నేషనల్ హైవేకు తీసుకువెళ్తున్నట్టు చిన్న రిసిప్టు తప్ప వేరే ఇతర కాగితాలు చూపించలేదని తెలిపారు. అదేవిధంగా అక్కడే ఉన్న 45 టన్నుల కెపాసిటీ గల వే బ్రిడ్జి దగ్గర బూడిద లోడ్‌తో ఉన్న లారీని కాంట వేయగా జీరో లోడ్ అని చూపిస్తున్నదని, దీన్ని బట్టి చూస్తే కెపాసిటీ కంటే ఎక్కువ బూడిద లారీలో ఉన్నట్టు తెలుస్తున్నదని చెప్పారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఒక లారీలో 32 టన్నుల బూడిద తరలించాలని, కానీ, అందుకు విరుద్ధంగా 50 నుంచి 65 టన్నుల ఓవర్‌లోడ్‌తో తరలిస్తున్నారని చెప్పారు. నిత్యం రామగుండం ఎన్టీపీసీ నుంచి ఖమ్మంకు 300 లారీల ఫ్లైయాష్ రవాణా అవుతుందన్నారు. 32 టన్నుల బూడిద సామర్థ్యమున్న లారీకి కిరాయి ₹25 వేలు ఉంటుందని, అయితే ఓవర్‌లోడ్‌తో వెళ్తుండడంతో వాహనాలకు కిరాయి తప్పుతుందని తెలిపారు. అందులో నిత్యం ₹50 లక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జేబులోకి వెళ్తున్నాయని ఆరోపించారు. అధిక లోడుతో వెళ్తున్న లారీలతో రోడ్లు దెబ్బతినడమేగాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇటీవల తుమ్మనపల్లి వద్ద బూడిదతో టూవీలర్ అదుపుతప్పడంతో కిట్స్ కళాశాల అధ్యాపకుడు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి జిల్లాలోని రవాణా శాఖ అధికారులను నయానో భయానో లొంగదీసుకొని ఈ తతంగం నడుపుతున్నారని ఆరోపించారు. ఇటీవల 11 లారీలను రవాణాశాఖ అధికారులకు పట్టించానని, అయితే అందులో రెండు లారీలకు మాత్రమే కేసు రాసి మిగతా వాటిని వదిలిపెట్టడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

## విడిపోయి.. లోక్ అదాలత్‌లో ఒక్కటై



లోక్ అదాలత్‌లో కలిసిన జంటను అభినందిస్తున్న సిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్ ప్రేమలత

సిరిసిల్ల గాంధీచౌక్, జూన్ 8 : కలిసి ఉంటే కలదు సుఖమని ఆ దంపతులు గుర్తించారు. రాజీ పడితే తమ జీవితాలు బాగుంటాయని భావించారు. కుటుంబ కలహాలతో దూరమైన ముస్తాబాద్‌కు చెందిన మేకల సమ్మయ్య, దుర్గవ్వ దంపతులు శనివారం లోక్ అదాలత్ సాక్షిగా తిరిగి ఒక్కటయ్యారు. ఆ దంపతులు మనస్పర్థలతో కొద్దిరోజులుగా వేర్వేరుగా ఉంటున్నారు. దుర్గవ్వ తన తల్లిగారిల్లయిన హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారానికి వెళ్లి అక్కడే ఉంటున్నది. ఈ క్రమంలో వేధిస్తున్నాడని తన భర్త సమ్మయ్యపై ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు కొద్ది రోజుల తర్వాత లోక్ అదాలత్‌కు చేరింది. శనివారం సిరిసిల్ల జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎన్ ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైశ్వాల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన ఆ దంపతులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫలితంగా వారిద్దరు కలిసిపోయారు. కలిసి జీవించడానికి సమ్మతించారు. అనంతరం దంపతులకు జడ్జి ప్రేమలత పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు.

## బంగారం కడిగిస్తామని మోసం

- వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెల తాడు చోరీకి యత్నం
- గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి
- విచారణ చేపట్టిన పోలీసులు

కోనరావుపేట, జూన్ 8: బంగారం కడిగిస్తామని ఇద్దరు దుండగులు ఓ వృద్ధురాలిని మోసం చేశారు. గుట్టు చప్పుడు కాకుండా మూడు తులాల పుస్తెల తాడును అపహరించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు గమనించి వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కోనరావుపేట మండలంలోని మల్కపేటలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కట్లె మల్లవ్వ అనే వృద్ధురాలు ఇంటి ముందు కూర్చొని ఉండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి బంగారం కడిగిస్తామని మాయమాటలు చెప్పి నమ్మించారు. దీంతో ఆమె నమ్మి మెడలో ఉన్న పుస్తెలు తాడును తీసి కడిగేందుకు ఇచ్చింది. దీంతో వారు దానిని రసాయనాల్లో ముంచగా నల్లగా అయిపోయింది. గమనించిన వృద్ధురాలు అరుపులు, కేకలు పెట్టడంతో చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో విషయం తెలుసుకుని దుండగులను పట్టుకుని దేహశుద్ధి చేసి పంచాయతీ కార్యాలయంలో బంధించారు. వృద్ధురాలి బంగారాన్ని బంగారు షాపు నిర్వాహకుల వద్దకు తీసుకువెళ్లి చూపించగా కొంతమేర తరుగు వచ్చింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరు ఎక్కడి నుంచి వచ్చారు, ఇప్పటికే ఇలాంటి మోసాలకు ఏమైనా పాల్పడ్డారా? అనే విషయాలపై పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## 7016 సీట్ల కేటాయింపు



కమాన్‌చౌరస్తా, జూన్ 8 : శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో దోస్త్ తొలివిడుతలో 7016 సీట్లు కేటాయించినట్లు యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ సూరపల్లి సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యా మండలి దోస్త్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీట్ల కేటాయింపులో యూనివర్సిటీ పరిధిలో 36,184 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అలాగే, ప్రభుత్వ కళాశాలల్లో మొత్తం ఖాళీల సంఖ్య 5520కు గానూ 402 రెండు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలల్లో 2,700 సీట్లకు 1762 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ప్రైవేట్ కళాశాలల్లో 34,980 సీట్లకు 4,852 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. మొదటి విడుతలో సీట్లు పొందిన విద్యార్థులు 12లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి, సీట్లు రిజర్వ్ చేసుకోవాలని, లేకుంటే సీటు రిజిస్ట్రేషన్ రద్దవుతుందన్నారు. రెండో విడుత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వివరించారు.

# నకిలీ వైద్యులపై కొరడా

- ఎలాంటి అర్హత లేకుండానే వైద్యులుగా చెలామణి
- అనుమతి లేకున్నా క్లీనిక్‌లు, ల్యాబ్‌ల నిర్వహణ
- తమ పరిధి దాటి వైద్యం.. రోగుల ప్రాణాలతో చెలగాటం
- తాజాగా కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో మెడికల్ కౌన్సిల్ దాడులతో బట్టబయలు
- కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే ఐదు కేసులు
- స్థాయిని మించి వైద్యం చేయవద్దని ఆర్ఎంపీలకు హెచ్చరిక
- పర్మిషన్ లేని క్లీనిక్‌లపై కేసులు : రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు రాజ్‌కుమార్

నకిలీ వైద్యులపై రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ కొరడా ఝులిపిస్తున్నది. ఎలాంటి అర్హత లేకున్నా వైద్యులుగా చెలామణి అవుతూ.. ల్యాబ్‌లు నిర్వహిస్తూ.. వచ్చీరాని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నది. తమ పరిధి దాటి వైద్యం చేస్తున్న వారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేస్తున్నది. ఇప్పటికే లింగాపూర్‌లో ఓ మహిళా ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ వృద్ధురాలు మృతి చెందడం, ఇలానే ఎన్నో సంఘటనలు జరుగుతున్నట్టు తెలుస్తుండగా.. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ ఆదేశాల మేరకు శనివారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో జిల్లా మెడికల్ కౌన్సిల్ బాధ్యులు రంగంలోకి దిగారు. ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లీనిక్‌లపై ఆకస్మిక తనిఖీలు చేయగా, అక్కడ జరుగుతున్న వైద్యాన్ని చూసి విస్తుపోయారు. తాజా తనిఖీల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్లీనిక్‌లపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. స్థాయిని మించి వైద్యం చేయొద్దని హెచ్చరించారు.

కరీంనగర్, జూన్ 8 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిధి దాటుతున్నారు. వచ్చీరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కేవలం ప్రాథమిక వైద్యం మాత్రమే చేసి పట్టభద్రులైన వైద్యుల వద్దకు చికిత్స కోసం పంపాల్సి ఉన్నా.. అన్నీ తామే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఇంజక్షన్లు ఇవ్వడమే కాదు, ఏకంగా ఆపరేషన్లు చేసే స్థాయికి వెళ్లారు. శనివారం మెడికల్ కౌన్సిల్ బాధ్యులు ఆకస్మిక తనిఖీలు చేసిన సందర్భంగా నీలోజిపల్లిలో ఓ ఆర్ఎంపీ ఇంజక్షన్ ఇస్తే ₹100 అని బాజాప్త బోర్డు పెట్టుకుని మరీ వైద్యం చేస్తున్నట్టు, అనుమతి లేకుండా ల్యాబ్ నడిపిస్తున్నట్టు గుర్తించడం పరిస్థితికి అద్దం పడుతున్నది. వచ్చీరాని వైద్యంతో రోగుల ప్రాణాల మీదికి తేవడమే కాదు, స్టెరాయిడ్ వంటివి కూడా ఇస్తుండడంతో రోగులు కోలుకోలేని పరిస్థితి వస్తున్నది. అంతే కాకుండా కమీషన్ల కక్కుర్తితో అవసరం లేకున్నా భయపెడుతూ.. కరీంనగర్ లాంటి నగరంలో విస్తరించి ఉన్న ప్రైవేట్ దవాఖానలకు పంపడం కనిపిస్తున్నది. ఇటు ప్రైవేట్ వైద్యులు కూడా వీరికి పెద్ద మొత్తంలో కమీషన్లు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



నీలోజిపల్లిలో అనుమతి లేని క్లీనిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ రాజ్‌కుమార్



ఆసిఫ్‌నగర్‌లోని క్లీనిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రాజ్‌కుమార్

### మెడికల్ కౌన్సిల్ దాడులు

మానకొండూర్ మండలం లింగాపూర్‌లో ఓ ఆర్ఎంపీ వచ్చీరాని వైద్యం చేసి ఓ వృద్ధురాలు ప్రాణాలు పోవడానికి కారకురాలైంది. ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నా వెలుగులోకి రాకుండా పోతున్నాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే కాకుండా ఇటీవలి కాలంలో వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ మహేశ్ ఆదేశాల మేరకు జిల్లాల బాధ్యులు రంగంలోకి దిగారు. హెల్త్ కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్, ఐఎంఏ సభ్యులు డాక్టర్ వంశీ, హెచ్ఆర్‌డీఏ కార్యదర్శి డాక్టర్ గౌతం, విజిలెన్స్ ఆఫీసర్ భరత్‌కుమార్ తదితరులు సంయుక్తంగా శనివారం ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లీనిక్‌లపై దాడులు చేస్తున్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి, కొదురుపాక, కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మండలం చింతకుంట, ఆసిఫ్‌నగర్ గ్రామాల్లో తనిఖీలు జరిపారు. ఆసిఫ్‌నగర్‌లో రీసా క్లీనిక్, వందనా క్లీనిక్, సిటీ క్లీనిక్, శ్రీవిషిక క్లీనిక్ అండ్ ల్యాబ్, చింతకుంటలో ఆనంద్ క్లీనిక్ అండ్ ల్యాబ్, నీలోజిపల్లి గ్రామాల్లో జక్కని లక్ష్మీనారాయణ ఎలాంటి విద్యార్హతలు లేకుండా 25 ఏళ్లుగా కరుణ క్లీనిక్ పేరిట అనుమతి లేని క్లీనిక్, ల్యాబ్‌ను నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్లీనిక్‌లో అనేక అలోపతి ఇంజక్షన్లు, యాంటిబయాటిక్, స్టెరాయిడ్స్ కూడా లభించినట్టు మెడికల్ కౌన్సిల్ సభ్యులు తెలిపారు.

### ఇప్పటికే ఐదు కేసులు

అనుమతి లేకుండా, హద్దులు మీరి వైద్యం చేస్తున్న వారిపై మెడికల్ కౌన్సిల్ కొరడా ఝులిపిస్తున్నది. కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే ఐదు కేసులు నమోదైనట్టు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. తాజా తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన అనుమతి లేని క్లీనిక్‌లు నిర్వహిస్తున్న వారిపైన కూడా కేసులు నమోదు చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ చట్టం–2019 సెక్షన్ 34,54 ప్రకారం అర్హత లేకుండా అలోపతి వైద్యం చేసినట్లయితే ₹5 లక్షల జరిమానా, ఏడాది పాటు జైలు విధించ వచ్చని, తెలంగాణ రాష్ట్ర మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 20, 22ప్రకారం కూడా శిక్షార్హులు అవుతారని చెప్పారు. క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ జీవో నంబర్ 47 అండ్ 48 ప్రకారం దవాఖానల రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.



మల్టీపర్పస్ స్కూల్ పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు

## సుందరంగా మల్టీపర్పస్ మైదానం



మల్టీపర్పస్ స్కూల్ పార్కులో అభివృద్ధి పనులు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 8 : కరీంనగర్ నడ్డిబొడ్డున ఉన్న మల్టీపర్పస్ స్కూల్ మైదానంలో చేపడుతున్న పార్కు సుందరంగా మారుతున్నది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఏళ్ల తరబడిగా సాగుతున్న పనుల్లో మళ్లీ ఇప్పుడిప్పుడే వేగం పుంజుకున్నది. ₹5.50 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేస్తుండగా, అందులో ₹2 కోట్లతో మ్యూజికల్ పౌంటేయిన్‌ను, ₹1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, ₹50 లక్షలతో పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన వస్తువులను ఏర్పాటు చేశారు. మ్యూజికల్ పౌంటేయిన్ పనులు శరవేగంగా చేస్తున్నారు. సుమారు అరగంటపాటు ఈ మ్యూజికల్ పౌంటేన్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు ఓపెన్ థియేటర్ పనులు తుది దశకు చేరగా, అందులో కళాకారుల ప్రదర్శనలతోపాటు ఇతర సినిమాలు ప్రదర్శించనున్నారు. వచ్చే రెండు నెలల్లోనే ఈ పార్కు అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## జాగిలం రాజా మృతి

- నివాళులర్పించిన సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



పూల దండ వేసి, ఘన నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల రూరల్, జూన్ 8 : పోలీస్ శాఖలో 14 ఏళ్లుగా సేవలందించిందిన ఆ జాగిలం అనారోగ్యంతో మృతి చెందింది. తంగళ్లపల్లి మండలం తాడూరులోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో లబ్రాడార్ రిట్రీవర్ సంతతికి చెందిన పదిహేనేళ్ల రాజా (జాగిలం) శనివారం ఉదయం చనిపోగా.. పోలీస్ అధికారు లు,జాగిలం హ్యాండ్లర్ మల్లేశంతో కలిసి ఎస్పీ అఖిల్ మహాజన్ ఆ జాగిలంపై పుష్పగుచ్ఛా లు వేసి నివాళులర్పించారు. వీఐపీలు, వీవీఐపీలు సందర్శించినప్పుడు స్నిపర్, బాంబులు, మందుపాత్రలు గుర్తించడంలో జాగిలం రాజా చాకచక్యంగా వ్యవహరించదని గుర్తుచేశారు. 2010లో రాజా తన హ్యాండ్ల ర్ మల్లేశంతోపాటు ఎనిమిది నెలలపాటు ప్రత్యేకంగా ఐఐటీఏ మెయినాబాద్‌లో ట్రెయినిం గ్ తీసుకొని జిల్లాకు వచ్చిందని, అప్పటి నుంచి సేవలందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, డాగ్‌స్క్వాడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 10న సర్టిఫికెట్ల పరిశీలన : కరీంనగర్ డీఈవో

కమాన్‌చౌరస్తా, జూన్ 8 : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా భాషా పండితులు తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీలకు ఈ నెల 10న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు తెలిపారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాలోని 131 మంది తెలుగు భాషా పండితుల్లో 116 మంది, 120 మంది హిందీ భాషా పండితుల్లో 107 మంది, ఉర్దూలో నలుగురికి నలుగురు అప్‌గ్రేడ్ అయినట్లు ఉత్తర్వులు వెలువడినట్లు పేర్కొన్నారు. అలాగే, తెలుగు విభాగంలో 71 మంది ఉపాధ్యాయులకు 59 మంది, ఉర్దూలో ముగ్గురికి ఇద్దరు అప్‌గ్రేడ్ అయ్యారని చెప్పారు.

# నేడే గ్రూప్ -1 ప్రిలిమినరీ టెస్ట్

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 87 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 37,152 మంది అభ్యర్థులు
- సెంటర్ల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు
- టీజీపీఎస్సీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరాలి

గ్రూప్–1 ప్రిలిమినరీ టెస్ట్‌కు వేళయింది. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పరీక్షకు సర్వం సిద్ధమైంది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 87 ఎగ్జామ్ సెంటర్లలో 37,152 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా, యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 8: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 37,152 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, 87 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో 36 సెంటర్లలో 18,663 మంది, పెద్దపల్లి జిల్లాలో 14 కేంద్రాల్లో, 6098 మంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15 కేంద్రాల్లో 4699 మంది, జగిత్యాల జిల్లాలో 22 కేంద్రాల్లో 7,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనుండగా, కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. వేసవి దృష్ట్యా అన్ని కేంద్రాల్లో అభ్యర్థులకు తాగునీటి వసతితో పాటు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు కూడా బిగించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు ఇప్పటికే పరీక్ష విధులు నిర్వహించనున్న అధికారులతో సమీక్షలు చేపట్టారు.

### తొమ్మిది గంటల నుంచే లోనికి..

అభ్యర్థులు తాము పరీక్ష రాయబోతున్న కేంద్రానికి రెండు గంటల ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచే లోనికి అనుమతించనున్నారు. అనంతరం బయోమెట్రిక్ తీసుకోనున్నారు. బయోమెట్రిక్ వేస్తేనే వారి ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనం జరుగుతుందని టీజీపీఎస్సీ విడుదల చేసిన గైడ్‌లైన్స్ స్పష్టం చేస్తుండగా.. అభ్యర్థులు విధిగా బయోమెట్రిక్ వేయాలని చెబుతున్నారు. పది గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయనున్నారు. అనంతరం వచ్చే అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లో కూడా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

### నిబంధనలు తప్పనిసరి

అభ్యర్థులు బయోమెట్రిక్ వేయాల్సి ఉన్న నేపథ్యంలో చేతులకు ఎలాంటి మెహిందీ గానీ, గోళ్లకు నెయిల్ పాలిష్ గానీ వేయకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎప్పటిమాదిరిగానే ఈ సారి కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు గానీ, సెల్‌ఫోన్లు గానీ, ఎలాంటి బంగారపు ఆభరణాలు కానీ ధరించకూడదనే నిబంధన అమలులో ఉన్నది. అలాగే, అభ్యర్థులు బూట్లు వేసుకోకుండా సాధారణ చెప్పులు మాత్రమే ధరించి పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. అభ్యర్థులు తప్పనిసరి తమ వెంట ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలి. ఓటర్, ఆధార్, ఎంప్లాయ్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు లాంటివి కూడా తీసుకురావచ్చు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై ఇటీవల దిగిన పాస్‌పోర్టు సైజు ఫోటో మాత్రమే అతికించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫొటో, సంతకం స్పష్టంగా ఉంటేనే చెల్లుబాటవుతుంది. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, ఒకరికన్నా ఎక్కువ మంది ఆయా ప్రాంతాల్లో సంచరిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అలాగే, అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు చేర్చేందుకు అవసరమైన రవాణా వసతులు కూడా కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571